క్లుప్తంగా

నేడు మెగా కంటివైద్య శిబిరం

పోరుమామిళ్ల : స్థానిక పంచాయతీ కార్యాలయంలో నంద్యాల శాంతిరామ్ మెడికల్ కాలేజీ జనరల్ హాస్పిటల్ వైద్య సిబ్బందిచే శుక్రవారం ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఆది తెలిపారు. సర్పంచ్ సుధాకర్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరం ఉంటుందన్నారు. పోరుమామిళ్ల ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చాముండేశ్వరి అలంకరణలో పెద్దమ్మ తల్లి



చాముండేశ్వరి అలంకారంలో పెద్దమ్మ తల్లి

మైదుకూరు : మైదుకూరులో గ్రామ దేవత పెద్దమ్మ తల్లి గురువారం చాముండేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దమ్మ తల్లి 24వ ప్రతిష్ఠ వార్షికోత్సవాల్లో భాగంగా భక్తులు విశేష పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రారంభానికి సిద్ధంగా విద్యుత్ సబ్‌స్టేషన్



బాలాయపల్లెలో ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్

కాశినాయన : మండలంలోని బాలాయపల్లె గ్రామంలో రూ.4 కోట్లతో నిర్మించిన 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఇప్పటికే మండలంలో వరికుంట్ల, నరసాపురం, కె.ఎస్.కొట్టాల, పగడాలపల్లె, అమగంపల్లె గ్రామాల్లో 5 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. లోటల్టేజ్ లేకుండా రైతులకు విద్యుత్‌ను అందించేందుకు ఈ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. టెస్ట్ ఛార్జింగ్ చేశామని, త్వరలో ప్రారంభిస్తామని విద్యుత్ అధికారులు తెలిపారు.

గడ్డివామి దగ్ధం

చాపాడు : మండలంలోని చియ్యపాడులో జయరామిరెడ్డి అనే రైతుకు చెందిన 8 ఎకరాలలోని గడ్డివామి గురువారం దగ్ధమైంది. గ్రామంలోని సాయిబాబా దేవాలయం సమీపంలో ఉన్న గడ్డివామికి గురువారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. స్థానికులు అగ్ని మాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు వచ్చేలోపే గడ్డివామి కాలిపోయింది.

గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలి




గర్భిణీలకు భోజనం వడ్డిస్తున్న డాక్టర్ హనీఫ్‌బాబా

ప్రొద్దుటూరు క్రైం : గర్భిణీలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని డాక్టర్ హనీఫ్‌బాబా తెలిపారు. మండలంలోని కామనూరు పీహెచ్‌సీలో గురువారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్లు వరప్రసాద్, చంద్రకళ, స్టాఫ్ నర్సులు విజయమ్మ, సరోజ, సీహెచ్‌ఓలు మెర్సినీనా, శిరీషా, ఫార్మసిస్టు శ్రీధర్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు లక్ష్మీవేంకటేశ్వర ఆలయ 11వ వార్షికోత్సవం

పోరుమామిళ్ల : స్థానిక శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థాన 11వ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, పూజా కార్యక్రమాలు, అభిషేకం, 9:30 గంటలకు పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం భక్తుల చేతుల మీదుగా జరుగుతుందన్నారు. సాయంత్రం 6:30 గంటలకు గుడి ఉత్సవం జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

కస్తూర్బా విద్యార్థినులకు అవగాహన



పోరుమామిళ్ల : స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ, ఫిజిక్స్ అధ్యాపకులు ఓపన్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కెమిస్ట్రీ అధ్యాపకులు ప్రకాష్, ఫిజిక్స్ అధ్యాపకులు వెంకటరావు ఆయా సబ్జెక్టులపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నరేష్ నేతృత్వంలో కెమిస్ట్రీ, ఫిజిక్స్ శాఖల లాబొరేటరీల్లో కస్తూర్బా విద్యార్థినులు అధ్యాపకులు నుంచి శిక్షణ పొందారు.

పార్టీకి వారధులు గృహసారథులు

ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి



బి.మఠంలో గృహసారథుల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వ పథకాలకు గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు వారధులని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. పార్టీ ఆదేశాలమేరకు గురువారం బి.మఠంలోని యోగివేమారెడ్డి అన్నదాన సత్రంలో మండల స్థాయి వైఎస్సార్ పార్టీ గ్రామ సచివాల కన్వీనర్లు, గృహసారథులకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఇచ్చిన హామీలు 99 శాతం నెరవేర్చిన ముఖ్యమంత్రి మన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అలాంటి పార్టీకి మీరు గృహసారథులు కావడం గొప్ప విశేషం అన్నారు. పథకాలు ప్రజలకు అందుతున్నాయి కాబట్టే ప్రతి కార్యకర్త ప్రతి ఇంటికి వెళ్లి మన ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నదే గృహసారథుల లక్ష్యం అన్నారు. ఇంకా ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకుండా ఉంటే వాలంటీర్ల ద్వారా సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల ద్వారా ఇప్పించాలన్నారు. గత ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో కనీసం 5 కూడా పూర్తి చేయలేక పోయిందన్నారు. హామీలు నెరవేర్చకుండా మోసం చేయడంతో టీడీపీని ప్రజలు విస్మరించారు. మన ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంతో మనం ప్రజల వద్దకు పోయేదమ్ము ఉందన్నారు. నియోజకవర్గం పరిశీలకుడు యల్లారెడ్డి మాట్లాడుతూ పార్టీ ఆదేశాల ప్రకారం తాను మైదుకూరు నియోజకవర్గం పార్టీ పరిశీలకుడుగా ఉన్నానన్నారు. ఈ నియోజకవర్గంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు జరగబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డిని గతం కన్నా అధిక మెజార్టీతో గెలిపించాలని ఉన్నారు. ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వారికి ప్రజల్లోకి వెళ్లడానికి ఏమీలేక ఇదేమి ఖర్మ అంటూ ప్రజలవద్దకు వెళుతున్నారు. కేవలం వీధులలో తిరుగుతున్నారు తప్పా ప్రజల వద్దకు వెళ్లడం లేదన్నారు. జెడ్పీటీసీ ఎం రామగోవిందరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ఎప్పుడూ వైఎస్ జగనే కావాలని ప్రజలు కోరుతున్నారన్నారు. కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షుడు సుబ్బారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మేకల రత్నకుమార్ యాదవ్, గృహసారథుల మండల కన్వీనర్ కూనపులి రాజానాయుడు, గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు, గ్రామ సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా పథకాలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తోందని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని సోమిరెడ్డిపల్లె 3 గ్రామ సచివాలయం పరిధిలోని నరసన్నపల్లె ఎస్సీకాలనీ, ఓసీ కాలనీలో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికి వివిధ రకాల పథకాల ద్వారా లక్ష నుంచి రూ. 3.50 లక్షల వరకు లబ్ధి చేకూరిందని తెలిపారు.

- నరసన్నపల్లె ఎస్సీలు 2007లో అసైన్‌మెంట్ కమిటీద్వారా దాదాపు 400 మందికి వ్యవసాయ డీకేటీ పట్టాలు పాస్‌బుక్కులు ఇచ్చారు.. ఇంతవరకు భూములు చూపలేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే స్పందించి స్థానిక ఇన్‌చార్జి తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డితో మాట్లాడి అనంతరం బద్వేల్ ఆర్డీఓ వెంకటరమణతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. సమస్యను పరిష్కరిస్తామని ఆర్డీఓ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఎం రామగోవిందరెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు నేలటూరి సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మేకల రత్నకుమార్ యాదవ్, సర్పంచ్ సోమిరెడ్డిపల్లె రామయ్య, ఎంపిటీసీ పోలు అంకిరెడ్డి, ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు ఉచిత నీటి వసతి



లబ్ధిదారురాలితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి

బద్వేలు అర్బన్ : ఆయా జగనన్న కాలనీల్లో సొంతంగా ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారుల సౌకర్యార్థం ట్యాంకర్ల ద్వారా ఉచిత నీటి వసతి కల్పిస్తున్నట్లు మున్సిపల కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి తెలపారు. గురువారం చెన్నంపల్లె జగనన్న కాలనీలో ఉచిత నీటి పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలోని జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారుల కోసం నాలుగు ట్యాంకర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. నీరు అవసరమైన లబ్ధిదారులు ఆయా సచివాలయాల సిబ్బందికి సమాచారమిస్తే లేఅవుట్‌లోకి వెళ్ళి డ్రమ్ముల్లో నీటిని నింపుతామని తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వీరనారాయణరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించండి

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లుకు వినతి



వివేకానంద కాలనీ ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : మీనాపురం వైఎస్సార్ జగనన్న కాలనీలో నీటి సమస్యను పరిష్కరించాలని వివేకానంద కాలనీ వాసులు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని కోరారు. సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కొత్తపల్లె గ్రామ పంచాయతీలోని వివేకానంద కాలనీలో పర్యటించారు. ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వివరాలను వివరించి సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పలు చోట్ల ఎమ్మెల్యేతో మాట్లాడారు. అధికారులతో మాట్లాడి నీటి సమస్యను పరిష్కరిస్తానని మీనాపురం వాసులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే రోడ్లు, కాలువలు నిర్మించాలని స్థానికులు కోరగా మంజూరు చేస్తామన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిశీలించి కార్యకర్తలతో మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్‌తోపాటు ఎంపీపీ శేఖర్ యాదవ్, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణిరాజారాంరెడ్డి, టీటీడీ పాలకమండలి సభ్యుడు టంగుటూరు మారుతిప్రసాద్, ఎంపీటీసీ పేరం సునీత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతులు దహనం



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

ప్రొద్దుటూరు : కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతులను స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద గురువారం సీపీఎం నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు నిధులు కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేసిందన్నారు. రైల్వే జోన్, ప్రత్యేక హోదా, కడప స్టీల్ ప్లాంట్, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీను పట్టించుకోలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు మట్టి, నీళ్లు ఇచ్చి ప్రధాని మోదీ కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక హోదా, రైల్వే జోన్‌లపై ప్రశ్నించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈనెల 22 నుంచి నెలాఖరు వరకు ఆందోళన కార్యక్రమాలను చేస్తున్నట్లు తెలిపారు. సీపీఎం నాయకులు పక్కీరయ్య, శేఖర్, నరసింహా పాల్గొన్నారు.

విద్యార్థి, యువత సమస్యలపై పోరాటం చేయాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.రాజశేఖర్

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థి, యువత సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.రాజశేఖర్ పేర్కొన్నారు. స్థానిక ఎన్జీఓ హోంలో రెండో రోజు గురువారం ఉమ్మడి కడప జిల్లాల జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ విద్యావిధానం అమలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగాన్ని మతోన్మాద కేంద్రాలుగా మారుస్తున్నాయని విమర్శించారు. 1995లో మూతపడిన పాలకేంద్రాన్ని తిరిగి ప్రారంభించేందుకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు, జిల్లా కోశాధికారి జోకీశ్వర్, నాయకులు రాహెల్, పండ్రేస్, రిషి, నరేష్, సుభాషిణి, వైష్ణవి, కుసుమ, జ్యోతి, ప్రశాంత్, లావణ్య, వాసంత పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన




కుష్టువ్యాధి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

బి.కోడూరు : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏపీ సోషల్‌వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో గురువారం వైద్యాధికారులు డాక్టర్ ఎస్.వినీత్ కుమార్‌రాజు, డాక్టర్ ఎ.ఉదయకిరణ్‌ల ఆధ్వర్యంలో కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని రాగిరంగు మచ్చలు, చర్మం పొడిగా ఉండటం, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం లక్షణాలు ఉంటే కుష్టువ్యాధిగా భావించవచ్చని ప్రారంభదశలో వైద్యులను సంప్రదించి కిత్స ద్వారా నయం చేయవచ్చని తెలిపారు. వ్యాధి నిర్ధారణ తర్వాత ఉచితంగా మందులు అందజేస్తామని తెలిపారు. అనంతరం కుష్టువ్యాధి నిర్మూలనపై విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి నరసింహారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు జాన్‌విలియం, బాల య్య, ఎంఎల్‌హెచ్‌పీ జయగీత, ఏఎన్ఎం కుమారి, ఆశా కార్యకర్త మహేశ్వరమ్మ, ప్రిన్సిపాల్ శ్రీరాములు, ఫిజికల్ డైరెక్టర్ భాస్కరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దువ్వూరు : మండల పరిధిలోని పుల్లారెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం కుష్టువ్యాధిపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అదనపు అధికారి ఖాదర్‌వల్లి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేని రాగివర్ణంలో ఏర్పడిన మచ్చలు, పొడలు, కళ్లు మూతపడకపోయినా, కాళ్లు, చేతులు తిమ్మిర్లుగా ఉంటే వెంటనే ప్రభుత్వాస్పత్రికి వెళ్లి డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు సమీర, సురేష్‌బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అహల్యాబాయి, పీడీ శివారెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యవంతంగా మహా శివరాత్రి ఏర్పాట్లు



శివరాత్రి ఏర్పాట్లపై చర్చిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

చాపాడు : మహా శివరాత్రి సందర్భంగా భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా అధికారులు, ఆలయ కమిటీ నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని మండల అధ్యక్షులు తెలిదేల లక్ష్మయ్య పేర్కొన్నారు. మండలంలోని ముఖ్య పుణ్యక్షేత్రమైన అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి సన్నిధిలో గురువారం ఈఓ శ్రీనివాసులు పర్యవేక్షణలో నిర్వహణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ.. ఈ నెల 18, 19 తేదీల్లో మహా శివరాత్రి పురస్కరించుకుని వీరభద్ర స్వామి సన్నిధికి వేలాది మంది భక్తులు వస్తారని, వీరందరికీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. తహసీల్దారు సుభానీ మాట్లాడుతూ.. తాగునీరు, క్యూ లైన్ల కోసం బారికేడ్లు, హెల్త్ సెంటర్, కంట్రోల్ రూం, విద్యుత్ ఏర్పాట్లు ఇలా శివరాత్రి ఉత్సవాల రోజుల అన్ని రకాలైన ఏర్పాట్లు, వాహనాలకు ఇబ్బందులు లేకుండా పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ జీటీ వెంకటసుబ్బారెడ్డి, ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ రాధా కృష్ణవేణి, ఎస్ఐ కేసీ రాజు, సర్పంచ్ కిషోర్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి

మైదుకూరు : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'వైఎస్సార్ కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలని కంటి వైద్య నిపుణుడు ఎంఎస్ తేజ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని శెట్టివారిపల్లెలో గురువారం 60 ఏళ్ల దాటిన వారికి కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ తేజ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 413 ప్రత్యేక బృందాలు వృద్ధులకు కంటి పరీక్షలు చేపట్టాయన్నారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సత్యప్రియ మాట్లాడుతూ ఏ ఒక్కరూ కంటి సమస్యలతో బాధపడకూడదని సీఎం వైఎస్ జగన్ సత్సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. శెట్టివారిపల్లెలో 51 మందికి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఆపరేషన్ చేయిస్తామని డాక్టర్ ఎంఎస్ తేజ తెలిపారు.

బ్రహ్మంగారి సన్నిధిలో సినీయాక్టర్ కరాటే కల్యాణి



బ్రహ్మంగారిమఠం : సినీయాక్టర్ కరాటే కల్యాణి గురువారం పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకున్నారు. స్వామి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు అందిచారు. పూర్వపు మఠాధిపతి పెద్దకుమారుడు వెంకటాద్రిస్వామిని మఠాధిపతి నివాసంలో కలుసుకొని బ్రహ్మంగారు రాసిన కాలజ్ఞానం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈశ్వరీదేవిమఠం, సిద్దయ్యమఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విధులకు రాని వైద్యులపై చర్యలు తీసుకోవాలి

బద్వేలు అర్బన్ : ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తూ విధులకు సక్రమంగా రాకుండా ప్రైవేటు ఆసుపత్రులు నిర్వహిస్తున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కన్జూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక ప్రభుత్వాసుపత్రిని పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ కొంత మంది ప్రభుత్వ వైద్యులు పట్టణంలోని వేరు వేరు ప్రాంతాల్లో ప్రైవేటు ఆసుపత్రులు ఏర్పాటు చేసుకుని అక్కడే ఎక్కువ సమయం గడుపుతున్నారని, దీని వలన ప్రభుత్వాసుపత్రికి వచ్చే పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేసి అటువంటి వైద్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కన్జూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఓబులేసు, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

పండ్లు, బ్రెడ్లు పంపిణీ

బద్వేలు అర్బన్ : బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ జన్మదినం సందర్భంగా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ నారాయణ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కాగా, స్థానిక మైదుకూరు రోడ్డులో వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ ఈ.వై.యద్దారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. సిద్దవటం రోడ్డులోని మాలమహాసేన కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి మీసాలరవి ఆధ్వర్యంలో దళిత ప్రజా సంఘాల నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు శీనయ్య సుందర్‌రామిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడుగా రత్నకుమార్

బ్రహ్మంగారిమఠం: వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడుగా బి.మఠం మాజీ సింగల్ విండోఅధ్యక్షుడు మల్లేపల్లెకు చెందిన మేకల రత్నకుమార్‌యాదవ్‌ను నియమించినట్లు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తెలిపారు. గురువారం బి.మఠంలో వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ బీసీలకు అధిక ప్రాధాన్యతలో భాగంగా బి.మఠంకు యాదవ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు రత్నకుమార్‌యాదవ్‌ను నియమించినట్లు తెలిపారు.

తెగుళ్ళ నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి



రైతులకు సూచనలిస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ

బద్వేలు అర్బన్ : రైతులు సాగు చేసిన పంటలలో వచ్చే తెగుళ్ళ నివారణకు తగు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు మర్రిపాటి నాగరాజ తెలిపారు. బద్వేలు వ్యవసాయ డివిజన్ పరిధిలోని తిరువెంగళాపురం గ్రామంలో ఈ-క్రాప్ బుకింగ్ చేసుకున్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వరిలో కాండం తొలుచు పురుగును గుర్తించి రైతులకు సూచనలు అందించారు. అలాగే రైతుభరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న యూరియా నాణ్యతను పరిశీలించారు. యూరియాతో పాటు కరుకు పొట్టదశలో పొటాష్ ఎకరాకు 30 నుంచి 40 కిలోలు వేయాలని, తద్వారా గింజ నాణ్యత, చీడపీడలను తట్టుకునే సామర్థ్యం పెరుగుతుందని సూచించారు. అలాగే కాండం తొలుచు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయడం ఉత్తమమన్నారు. కార్యక్రమంలో ఆయా ఆర్బీకేల వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పశువైద్య సంచార అంబులెన్స్ ప్రారంభం

బ్రహ్మంగారిమఠం : ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంకు ఏర్పాటుచేసిన రెండు పశువైద్య సంచార అంబులెన్స్‌లను గురువారం బ్రహ్మంగారిమఠంలోని ఐదురోడ్ల కూడలిలో ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 1962కు కాల్‌చేస్తే మీ ఇంటిదగ్గరకు పశువైద్య వాహనం వస్తుందన్నారు. ఇటువంటి సదుపాయం ఏరాష్ట్రంలో లేదన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, సర్పంచ్ ఎస్.రామయ్య, ఎంపిటీసీ మనోహరాచారి. సింగల్‌విండో అధ్యక్షుడు సుబ్బారెడ్డి ఎంపీడీఓ వెంగముని రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి, బిమఠం మండల ఇన్‌చార్జి సహాయక సంచాలకులు ఎం. లక్ష్మినరసయ్య, పలుగురాళ్ళపల్లె పశువైద్యఅధికారి కె శిరీష, పెద్దిరాజుపల్లె పశువైద్యఅధికారి బి.నిత్యానంద్, బి కోడూరు పశువైద్య అధికారి భరద్వాజకృష్ణ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ హరిప్రసాద్

కాశినాయన : యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. గురువారం నరసాపురం మోడల్ కళాశాల, పాఠశాల విద్యార్థులకు మాదక ద్రవ్యాల వలన కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఈ వయస్సులోనే కొంత మంది విద్యార్థులు చెడు దోవ పడుతున్నారని, వాటికి దూరంగా ఉండాలన్నారు. పాన్ మసాలా, గుట్కా వంటి వాటికి దూరంగా ఉండి చక్కగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సౌజన్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పీతాంబర ఛత్రోత్సవం



మల్లెంకొండ పరిసర గ్రామాల్లో ఊరేగిస్తున్న పీతాంబర ఛత్రోత్సవం

గోపవరం : శివరాత్రి పర్వదినం సందర్భంగా ఈనెల 18వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే శ్రీమల్లెం కొండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారికి పీతాంబర ఛత్రోత్సవం మల్లెంకొండ పరిసర గ్రామాల్లో నిర్వహించారు. ముందుగా గురువారం తెల్లవారుజామున 5 గంటలకు ఓబుల్‌రెడ్డినగర్(మూడిళ్లు) వద్ద పూజలు నిర్వహించి గొడుగోత్సవాన్ని ప్రారంభించారు. అక్కడి నుంచి బ్రాహ్మణపల్లె, వడ్డెపాలెం, సూరేపల్లె, అడుసువారిపల్లె, ఎస్.రామాపురం, మీరుబ్బుల్లాయపల్లె గ్రామాల్లో ఛత్రోత్సవం నిర్వహించి మూడిళ్ల వద్దకు చేర్చారు. ఆయా గ్రామాల్లో భక్తులు స్వామి వారి ఛత్రోత్సవంలో పాల్గొని కాయకర్పూరం సమర్పించుకున్నారు. దేవాదాయశాఖ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, ఆలయ చైర్మన్ గోవిందరెడ్డి, ఈఓ సి.శివయ్య, సర్పంచ్ కలువాయిలక్ష్మిదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు రమణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుమల పాదయాత్ర ప్రారంభం



పాదయాత్రను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక టీటీడీ కల్యాణ మండపం వద్ద గురువారం వంగల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన తిరుమల పాదయాత్రను మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వరదరాజులరెడ్డి మాట్లాడుతూ వంగల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 450 మంది తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు పాదయాత్రగా వెళ్లడం సంతోషంగా ఉందన్నారు. వంగల నారాయణరెడ్డి మాట్లాడుతూ ఈనెల 15న తిరుమలకు చేరుకుని వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటామని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, కొర్రపాడు రామచంద్రారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, నాగిరెడ్డి పుల్లారెడ్డి, పర్లపాడు మహేశ్వరరెడ్డి, రసూల్ గౌస్, గంటా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గర్భవతులకు ఆరోగ్య సలహాలు



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి నాగరాజు

చాపాడు: కిల్కారి కార్యక్రమం ద్వారా ప్రభుత్వం గర్భవతులకు అసరమైన సలహాలు, సూచనలు చేసేందుకు 14423 టోల్ ఫ్రీ నెంబరు ప్రవేశపెట్టిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి నాగరాజు పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష యోజనా పథకంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారి శ్రీవాణి, సీహెచ్‌ఓ రాముడు, సూపర్‌వైజర్ సరస్వతి, ఎంపీహెచ్‌ఈఓలు ప్రసాద్, భాస్కర్, రమేష్, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– మండలంలోని అల్లాడుపల్లె గ్రామ సచివాలయ పరిధిలో గురువారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్య శిబిరంను డీఎంహెచ్‌ఓ నాగరాజు పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాజేష్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.